క్లుప్తంగా

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి



నెహ్రూనగర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న అని విగ్రహ కమిటీ సభ్యులు రావుల మణి పేర్కొన్నారు. బుధవారం లచ్చన్న 17వ వర్ధంతిని పురస్కరించుకొని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపిన లచ్చన్న ఆశయాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. గౌతు లచ్చన్న జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

23న సినీ పాటల పోటీలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 22, 23న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. 22న సాయంత్రం 6 గంటలకు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకంలోని ఘట్టాల ప్రదర్శన, 23న ఉదయం 10 గంటల నుంచి రాష్ట్రస్థాయి సినీ పాటల పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 7 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 5 వేలు, తృతీయ బహుమతిగా రూ. 3 వేలతో పాటు తొమ్మిది మంది విజేతలకు ప్రత్యేక నగదు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. కళాకారులు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు కవి జయరాజుతో ఆత్మీయ సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: అభ్యుదయ, తాత్విక, ప్రజాకవి జయరాజుతో శుక్రవారం మధ్యాహ్నం 2.00 గంటలకు బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య కళాశాల సమావేశ మందిరంలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు ప్రత్యూష సుబ్బారావు, నూతలపాటి అరవింద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్తమాన సమాజంలో అంతరిస్తున్న విలువలు, మానవ సంబంధాలు, ప్రకృతిపై మనిషి అవలంబిస్తున్న అనైతికత తదితర అంశాలపై ప్రజాకవిగా ముద్ర వేసుకున్న జయరాజు ఆలోచనలతో యువతను, మేధావులను మమేకం చేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ, స్టెప్, (స్టూడెంట్, టీచర్, ఎడ్యుకేటర్స్ అండ్ పేరెంట్స్ అసోసియేషన్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజాసంఘాలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆక్టోపస్ అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు



గుంటూరు మెడికల్: అమరావతి హాస్పిటల్, ఫైన్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వడ్డేశ్వరంలోని ఆక్టోపస్ ప్రధాన కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆక్టోపస్ అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్యులు పరీక్షలు చేశారు. ముఖ్య అతిథులుగా ఎస్.రవిచంద్ర, ఎం. నాగేంద్రరావు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిబిరంలో సేవలందించిన డాక్టర్ వేణు నాదెళ్ల, డాక్టర్ శైలజ కేతినేని, డాక్టర్ కె. వికాస్ కాట్రగడ్డ, డాక్టర్ ఎస్. శ్రీలేఖతో పాటు ఆసుపత్రుల వైద్య సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీలు కె.నగేష్ బాబు, కె.రామచంద్రమూర్తి, యూనిట్ డాక్టర్స్ టి. రత్నాకర్, జి. మంజువాణి పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డులో నగదు మాయంపై ఫిర్యాదు

నగరంపాలెం: క్రెడిట్ కార్డులో నగదు మాయంపై బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నెహ్రూనగర్ పరిధిలోని మోతీలాల్‌నగర్‌కు చెందిన టి.దుర్గారావు ఓ ప్రైవేటు ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్. మంగళవారం ఆయన కొత్త క్రెడిట్ కార్డు కోసం ఫేస్‌బుక్ చూస్తుండగా ఓ బ్యాంక్ తారసపడింది. దీంతో దాని పేరుని నొక్కగా, కింద ఫోన్ నంబర్ వచ్చింది. దుర్గారావు దానికి కాల్ చేయగా, అవతలి వ్యక్తి మాట్లాడాడు. ఆ తర్వాత ఆధార్ నంబర్‌తో పాటు పాత క్రెడిట్ కార్డు వివరాలను అవతలి వ్యక్తి నమోదు చేసుకున్నాడు. కొద్ది సేపటికి దుర్గారావు పాత క్రెడిట్ కార్డు నుంచి ఆరు విడతలుగా రూ.1,00,900 డ్రా చేశాడు. దీనిపై బాధితుడు బుధవారం కొత్తపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సీఎం జగన్ పాలనలో శరవేగంగా నగరాభివృద్ధి

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాభివృద్ధితో పాటు నగరాభివృద్ధి వేగంగా జరుగుతోందని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 36వ డివిజన్‌లో బుధవారం రూ.20లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం గుంటూరు అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రోడ్లు వేయాలని ప్రజలు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలు అవసరాలకు అనుగుణంగా, వారి ఇబ్బందుల్ని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ముఖ్యంగా నగరపాలక సంస్థ పాలకవర్గం ఏర్పడిన తరువాత ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా నగరాభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, మిర్చి యార్డు డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూ అంతర్ కళాశాలల వ్యాసరచన పోటీల విజేతలు



వ్యాసరచన పోటీల విజేతలతో ప్రొఫెసర్ లలిత

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం అంతర్ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గుంటూరు నగర పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో కామర్స్, బయోలాజికల్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన పోటీల్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థపై వస్తు సేవల పన్నుల ప్రభావం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పోషణ పాత్ర విశిష్టతపై ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థుల్లో సబ్జెక్టు పరమైన పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. కామర్స్ ఇంగ్లిష్ వ్యాస రచన పోటీలో షేక్ సాజిదాబేగం (ప్రభుత్వ మహిళా కళాశాల), కె. అనిల్‌కుమార్ (జేకేసీ కళాశాల), జి. హర్ష (హిందూ కళాశాల), కామర్స్ తెలుగు విభాగంలో కె. కావేరీ (ప్రభుత్వ మహిళా కళాశాల), పి. గౌతమ్ (టీజేపీఎస్ కళాశాల), షేక్ గల్జార్ బేగం (ప్రభుత్వ మహిళా కళాశాల), బయాలాజికల్ సైన్స్ ఇంగ్లిష్ విభాగంలో ఎం. కావేరీ (ప్రభుత్వ నర్సింగ్ కళాశాల), వి. యోగస్వి (చలపతి ఫార్మసీ కళాశాల), పి. కృష్ణకుమారి (సిమ్స్ కళాశాల), తెలుగు విభాగంలో కె. దుర్గ (ప్రభుత్వ నర్సింగ్ కళాశాల), ఈ. జనార్దన్, ఎం. అజయ్ (హారిక ఫిజియోథెరపీ కళాశాల) వరుసగా తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, కన్వీనర్ ప్రొఫెసర్ కె. లలిత, హెచ్‌ఓడీ వి. చక్రవర్తి, సహాయాచార్యులు డి. కళ్యాణి, సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, యు. పద్మావతి, బి. అనిత, బాజీబాబు, ఎస్. మణికంత, వి.అభిలాష్ పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ రామలింగం దంపతులను సన్మానిస్తున్న క్లబ్ వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఇటీవల నియమితులైన డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ రామలింగం దంపతుల్ని డాక్టర్స్ స్మైల్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాజ్యోతి మాట్లాడుతూ అందరి సహకారంతో వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తనకు అభినందనలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్, డాక్టర్ స్వప్న, డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నీలిమ, డాక్టర్ సుజాత, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ అరుణ, డాక్టర్ హక్, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్ యూరాలజీలో అరుదైన శస్త్ర చికిత్స

రూ. 6 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్ ఉచితం




వైద్యులకు అభినందనలు తెలియజేస్తున్న యువకుడి కుటుంబ సభ్యులు

గుంటూరు మెడికల్ : మూత్రం పైపు ఛిద్రం కావడం, పూర్తిగా మూత్రం రాక అవస్థలు పడుతున్న ఓ యువకుడికి గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి యురాలజీ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి సమస్య నుంచి విముక్తి కల్పించారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 16 ఏళ్ల యువకుడు ఎనిమిది నెలల క్రితం పొలం పనులు నిమిత్తం ట్రాక్టర్ ఎక్కుతున్న సమయంలో కింద పడి పోయాడు. దీంతో అంగం లోపలి భాగంలో మూత్ర సంచి నుంచి వచ్చే యూరిన్ పైపు చిట్లిపోయి, తెగిపోయింది. మూత్ర సంచి నుంచి యూరిన్ పైపు తెగి పోవడంతో ప్రైవేట్ వైద్యులు పొత్తి కడుపులో నుంచి రంధ్రం చేసి యూరిన్ పైపు వేసి దారి మళ్లించారు. అప్పటి నుంచి ఆ యువకుని కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగిన ఫలితం కనిపించలేదు. దాంతో చివరి ప్రయత్నంగా యువకుని తాతయ్య, సాంబయ్య మార్చి 11వ తేదీన గుంటూరు జీజీహెచ్ యూరాలజీ వైద్య విభాగానికి మనువడిని తీసుకొచ్చారు. యూరాలజీ వైద్యులు యువకుడికి వైద్య పరీక్షలు చేసి, పెల్విక్ ఫ్రాక్టర్ యురేత్రల్ డిస్ట్రాక్షన్ డిఫెక్ట్‌గా గుర్తించి, ప్రోగ్రెసివ్ పెరినీయల్ యురిత్రోప్లాస్టి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. మార్చి 17న సుమారు ఆరు గంటల సేపు విజయవంతంగా ఆపరేషన్ చేశారు. యురాలజీ విభాగం ఇంచార్జి డాక్టర్ జి.మనోహర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొహసీన్ ఖాదరి, పీజీలు డాక్టర్ సిరాజ్, డాక్టర్ అమ్రత్, మత్తు వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ నాగభూషణం ఆపరేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. మార్చి 30న యువకుడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొహసిన్ ఖాదిరి తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద సుమారు రూ. 6 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేశామన్నారు. బుధవారం యువకుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతికి, యూరాలజీ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అరుదైన శస్త్రచికిత్స చేసి యువకుడి సమస్యను తొలగించిన యూరాలజీ వైద్యులకు డాక్టర్ ప్రభావతి అభినందనలు తెలిపారు.

జీజీహెచ్‌లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

ఆసుపత్రిలో పర్యటించిన జిల్లా ఎస్పీ



ఏఎస్పీతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

నగరంపాలెం: జీజీహెచ్ పరిసర ప్రాంతాల్లో నేరాలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన ఆసుపత్రిలో పర్యటించారు. అత్యవసర సేవల చికిత్సా విభాగం, ఔట్ పోస్ట్ పోలీస్‌స్టేషన్ (ఓపీ), ఆసుపత్రి ప్రధాన కార్యాలయాలు, విభాగాలతోపాటు వాహనాలు నిలుపుదల చేసే ప్రదేశాల్ని తనిఖీ చేశారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది, ఓపీ పోలీసులతో మాట్లాడారు. 24 గంటలు విధుల్లో ఎంత మంది ఉంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో సీసీ కెమెరాల పనితీరుపై ఆరాతీశారు. విధుల్ని సమర్థంగా నిర్వర్తించాలని చెప్పారు. కాన్పులు, పిల్లల విభాగంతోపాటు ప్రధానమైన విభాగాల వద్ద అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించాలని ఆదేశించారు. రోగులు, వారి సహాయకులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. అత్యవసర వాహనాలకు అంతరాయం కలిగించవద్దని సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, తూర్పు డీఎస్పీ బి.సీతారామయ్య, కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులరెడ్డి, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, ఎస్‌ఐలు ఉన్నారు.

జన్మభూమి కాలనీ ప్రధాన రహదారికి మహర్దశ

గుంటూరు రూరల్: ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న జన్మభూమి కాలనీవాసుల ప్రధాన రహదారి ఇబ్బందులు నేటితో తొలగనున్నాయి. స్థానిక 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి చొరవతో తారు రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 30 సంవత్సరాలు అవుతున్నా గత ప్రభుత్వాలు నివాసితుల సమస్యల్ని పట్టించుకోలేదని తెలిపారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీలో అన్ని అంతర్గత రోడ్లు సీసీ రోడ్లుగా నిర్మించినట్లు చెప్పారు. డ్రైయిన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కాలనీ వాసుల ఆరోగ్య భద్రత కోసం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తారు రోడ్డు నిర్మాణానికి రూ. 31 లక్షలతో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. శివారు కాలనీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి నాగేశ్వరరావు, బంగారయ్య, బాబు, అప్పారావు, అనిల్, రాజు, ముత్యాల శ్రీనివాసరావు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

అల్లుడు కనిపించడం లేదని మామ ఫిర్యాదు



నగరంపాలెం: ఇంటి నుంచి వెళ్లిన అల్లుడు కనిపించడం లేదని మామ బుధవారం అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పిడుగురాళ్లకు చెందిన తిరుపతి శ్రీనివాసరావు (40) అలియాస్ శ్రీను బేల్దారి పనులకు వెళ్లే వాడు. ఈనెల 11న శారదా కాలనీలో ఉంటున్న మావ కొండయ్యను చూసేందుకు వచ్చాడు. అనంతరం ఊరెళ్తానని చెప్పి ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లాడు. అప్పట్నుంచి సొంతూరుకి గానీ, శారదా కాలనీలోని ఇంటికి గానీ రాలేదు. అల్లుడికి మూర్ఛలున్నాయని మావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అతని ఆచూకీ తెలిసిన వారు 8688831342, 9705643699 నంబర్లల్లో సంప్రదించాలని అరండల్‌పేట పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై వైద్యశాలల్లో అవగాహన



గుంటూరు మెడికల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పలు ఆస్పత్రుల్లో బుధవారం ఆ శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నిరోధానికి గాను మార్కెట్ సెంటర్‌లోని రమేష్ హాస్పిటల్, కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్ఓ పార్థసారథి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నగరంపాలెం: చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. పాత గుంటూరు సత్యనారాయణ గుడి సమీపాన ఈనెల 17న గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడు. దీంతో అతన్ని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుంది. ఆచూకీ తెల్సిన వారు పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మీపురం: నల్లపాడు రైల్వేస్టేషన్ వద్ద పట్టాలపై బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు చుట్టుపక్కల విచారించినా వివరాలు తెలియలేదు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. వివరాలకు గుంటూరు రైల్వే జీఆర్పీ స్టేషన్ లేదా 0863–2220753, 738684339ను సంప్రదించాలని ఎస్ఐ పి.శ్రీనివాసరావు కోరారు.

ఆటోనగర్ రైలు పట్టాలపై...

ఆటోనగర్ వద్ద రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించినట్లు గుంటూరు రైల్వే జీఆర్పీ ఎస్ఐ పి.రమేష్ తెలిపారు. వివరాలకు గుంటూరు రైల్వే జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో లేదా 0863–2220753, 939510725 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

దాతల సహకారం మరువలేనిది: ఎంపీ ఆళ్ల



మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ

నెహ్రూనగర్: విద్యార్థుల అభ్యున్నతి కోసం దాతలు సహకారం మరువలేనిదని ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్‌లో బుధవారం ఏపీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల శివారెడ్డి సహకారంతో రూ.7లక్షల వ్యయంతో విద్యార్థులకు కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని భవిష్యత్తులో ముందుకు రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డి హాస్టల్ ప్రతినిధులు చల్లా అంజిరెడ్డి, కంది సంజీవరెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, జంగా సత్యనారాయణరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, వణుకూరి సాంబిరెడ్డి, మోదుగుల పాపిరెడ్డి, శ్యామల కోటిరెడ్డి, జంగా సీతారామ్‌ప్రసాద్ రెడ్డి, దుగ్గెంపూడి సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

23 నుంచి సాయి మంజీర నృత్యోత్సవాలు



నృత్యోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించిన సుబ్రహ్మణ్యం తదితరులు

పాత గుంటూరు: అంతర్జాతీయ నృత్య దినోత్సవం పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు మహా మంజీరనాదం పేరుతో నృత్యోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. నృత్య పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో నృత్యోత్సవాల ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 23న డాక్టర్ కొండపర్తి వనజా ఉదయ్‌కు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కార ప్రదానం, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలు, 24న కేంద్ర సంగీత నాటక అకాడమీ ముఖ్య సలహాదారు వేదాంతం రామలింగశాస్త్రికి ఆత్మీయ సత్కారం, కళాకారుల నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. 25, 26 తేదీల్లో యువ కళారత్న పురస్కార గ్రహీతల నృత్య ప్రదర్శనలు, 27న ప్రొఫెసర్ భాగవతుల సేతురామ్‌కు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కార ప్రదానం, కళాకారుల నృత్య ప్రదర్శనలు, 28న అభినవ సత్యభామ కళాకృష్ణకు అక్కిరాజు మణిప్రియ స్మారక సాత్రాజితి పురస్కార ప్రదానం, నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 29న ఉదయం 9 గంటలకు పద్మావతి కల్యాణ వేదికపై ప్రపంచ నృత్య దినోత్సవ వేడుకలు, కళాకారుల నృత్య ప్రదర్శనలు, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత డాక్టర్ కృష్ణకుమార్‌కు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారం అందించి సత్కరిస్తున్నట్లు సుబ్రహ్మణ్యం వివరించారు.

రామచంద్ర ప్రభు సేవలు అభినందనీయం



మంచినీటి ట్యాంకర్ల వద్ద డాక్టర్ ప్రభావతి, తులసి రామచంద్ర ప్రభు తదితరులు

గుంటూరు మెడికల్: పలు కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న సేవాతత్పరుడు తులసి రామచంద్ర ప్రభు అని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి కొనియాడారు. అన్నార్తులకు, ఆపదల్లో ఉన్నవారికి ఆయన సేవలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా గుంటూరు జీజీహెచ్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులు, ఇతర అవసరాలకు వాడుకునేందుకు నీటి కొరత తలెత్తకుండా డాక్టర్ ప్రభావతి విజ్ఞప్తి మేరకు ప్రతిరోజు రెండు ట్యాంకర్ల మంచినీటిని అందజేసేందుకు రామచంద్ర ప్రభు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద బుధవారం నీటి ట్యాంకర్లను అందజేశారు. పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా గుంటూరు నగర శివారు ప్రాంత వాసులకు, నీటి ఎద్దడి సమస్య ఉన్న అనేక ప్రాంతాలకు మూడు ట్యాంకర్ల ద్వారా నిరంతరం ఉచిత మంచినీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, పాకనాటి రమాదేవి, బిట్రగుంట మల్లిక, ఆళ్ల హరి, మిరియాల శ్రీనివాస్, దళవాయి భార్గవ, పాలెం రాజశేఖర్, బర్మా ప్రసాద్, రాజేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతోనే ఉన్నత స్థానం



విద్యార్థినికి ఉపకార వేతనాన్ని అందజేస్తున్న డాక్టర్ శ్రీధర్

గుంటూరు ఎడ్యుకేషన్: కృషి, పట్టుదలతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు ఎం. శ్రీధర్ సూచించారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ 78వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని చెప్పారు. విద్యార్థి దశలోనే స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దాన్ని సాధించేందుకు శ్రమించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల కార్యదర్శి ఎం.వి.ఆర్.కె. ముత్యాలు, హిందూ కాలేజీ హైస్కూల్ కౌన్సిల్ కార్యదర్శి కె.ఎస్.ఆర్. కుటుంబరావు, పాఠశాల కార్యదర్శి ఎం.వి.ఎస్.ఆర్. ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు ఎం. శారదాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలమయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూ విడుదల చేసిన డిగ్రీ ద్వితీయ సంవత్సర మూడో సెమిస్టర్ ఫలితాల్లో గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. సంగడిగుంటలోని కళాశాలలో బుధవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఎస్సీ మాథ్స్, స్టాటిస్టిక్స్‌లో 10 మంది విద్యార్థులు నూరు శాతం మార్కులు సాధించారని చెప్పారు. బీకాంలో పరీక్షలు రాసిన విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఈ సందర్భంగా 400 మార్కులకు 395 మార్కులు సాధించిన సూర్య ఆదిత్యను కళాశాల కార్యదర్శి రామకృష్ణ ప్రభు అభినందించారు. భవిష్యత్తులో ఇదే విధమైన ఫలితాల్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకుల్ని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఏ. శ్రీధర్, భవానీదుర్గ, రాజరాజేశ్వరి, నాగ మల్లేశ్వరి, చంద్రశేఖర్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆడిటర్ అప్పారావుకు ఘన నివాళి

గుంటూరు రూరల్: ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల జాయింట్ సెక్రటరీ, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ పాలక మండలి సభ్యుడు, ఆడిటర్ బి.వి.అప్పారావు ఆకస్మిక మృతికి బుధవారం ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ పాలకమండలి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సొసైటీకి, కళాశాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ మద్దినేని జగదీష్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర పాల్గొన్నారు.

రేపు విజ్ఞాన్ నిరులాలో తల్లిదండ్రులకు ఆత్మీయ సన్మానం

గుంటూరు రూరల్: ఈ ఏడాది తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో అధిక వేతనాలతో ఉద్యోగాలు సాధించారని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక వెల్లడించారు. బుధవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ నెల 21వ తేదీన కళాశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో బీటెక్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థుల్లో 90 శాతం ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అత్యధికంగా రూ. 44 లక్షలు, రూ. 22లక్షల వేతనాలతో ఉద్యోగాలు సాధించారని ఆమె వెల్లడించారు. పలువురు మంచి వేతనాలతో బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, విజ్ఞాన్ సంస్థల వైస్ చైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు శుభాకాంక్షలు తెలిపారు.